
మంగమూరు రోడ్డులో..


రైలుపేటలో..


ఏబీఎం కాలేజీ వద్ద..


ఇందుర్తినగర్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి గోడ పక్కన..

నగరం చెత్తమయం..!

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మెతో ఒంగోలు నగరంలో చెత్త పేరుకుపోయింది. ఏ రోడ్డుకెళ్లినా భారీ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. ఆదివారం నుంచి కురుస్తున్న వర్షాలకు తడిసి కుళ్లిపోయిన చెత్త తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులతో పాటు ఆయా రోడ్లపై రాకపోకలు సాగించేవారు ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొన్నిచోట్ల రోడ్లపైకల్లా చెత్త చేరడంతో పాటు వర్షం నీరు నిలిచి మురికికూపాలు ఏర్పడ్డాయి. నగరవాసులు నరకం చూస్తుండగా, పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వ అధ్వానపు పరిపాలనను ప్రజలు ఛీ కొడుతున్నారు.

- సాక్షి, ఒంగోలు


దిబ్బల రోడ్డులో..


గోరంట్ల మల్టీప్లెక్స్ రోడ్డులోని ఆర్యవైశ్య ఆరామక్షేత్రం వద్ద..


ఆర్జీలియం స్కూల్ వద్ద..


తూర్పుక్రిస్టియన్‌పాలెంలో..


లాయర్‌పేటలో..


మాగుంట సుబ్బరామిరెడ్డి సర్కిల్‌లో.. రోడుపై చెత్త నిల్వ


కమ్మపాలెంలో..


గోరంట్ల మల్టీప్లెక్స్ కాంప్లెక్స్ రోడ్డులో..


ఇస్లాంపేట కబేళా బజార్‌లో..


ఒంగోలు డీఎస్పీ కార్యాలయం సమీపంలో..


క్లౌపేటలో నివాసాల మధ్య..


గోపాలనగరంలో..


రాజీవ్ గృహకల్ప కాలనీ సమీపంలో..


కొప్పోలు రోడ్డులో..

క్లుప్తంగా

ఈశ్వరి మాత దివ్య మందిర పునఃనిర్మాణం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మఠాధిపతి, అర్చకులు

ఒంగోలు మెట్రో: కడప జిల్లా కందిమల్లాయపల్లె గ్రామంలోని బ్రహ్మంగారిమఠంలో శ్రీ ఈశ్వరి మాత దివ్య మందిరాన్ని పునఃనిర్మాణం చేస్తున్నట్లు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరశివకుమారస్వాములు తెలిపారు. స్థానిక కర్నూలు రోడ్డులోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో నిర్మాణానికి సంబంధించిన విధివిధానాల కరపత్రాన్ని సోమవారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలో పరమేశ్వరి స్వరూపిణి శ్రీ ఈశ్వరి మహాదేవి మఠాన్ని నూతనంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి అమ్మవారి భక్తులు విరివిగా ధన, వస్తు రూపేనా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థాన శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస, బిర్లా బ్రహ్మానందం, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులకు భూమి పూజ

ఒంగోలు సబర్బన్: నగరంలో పలు విద్యుత్ పనులకు ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒంగోలు నగరంలో లోఓల్టేజీ సమస్య లేకుండా చేస్తామన్నారు. అందుకోసం నగర పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించామన్నారు. అదేవిధంగా మంగమూరు రోడ్డు జంక్షన్‌లో రూ.11 కోట్లతో నిర్మించనున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం విద్యుత్ పనులకు భూమిపూజ చేశామన్నారు. భాగ్యనగర్‌లోని ఫారెస్ట్ కార్యాలయానికి వెనుకవైపు మరో రూ.4.50 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేపట్టామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు జనార్దన్ రావు, విజయ్‌కుమార్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు ఈఈ హరిబాబు, డీఈఈ పాండురంగారావు, ఏఈలు శివకుమార్, సంతోష్, డి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీ నియామకం

ఒంగోలు సబర్బన్: బీజేపీ జిల్లా కమిటీని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఏడుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు జనరల్ సెక్రటరీలు, ఏడుగురు సెక్రటరీలు, ఒక ట్రెజరర్, ఒక సోషల్ మీడియా కన్వీనర్, ఒక ఐటీ కన్వీనర్‌ను నియమించామన్నారు. అదేవిధంగా 22 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లను నియమించినట్లు తెలిపారు.

- నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- వలంటీర్ వ్యవస్థకు మంగళం
- చిరుద్యోగులపై ఉక్కుపాదం
- బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు
- చంద్రబాబు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బాబు వచ్చె.. జాబు పోయె..!

మద్దిపాడు మండలంలో కూటమి ప్రభుత్వం తొలగించిన ఉద్యోగులు

వలంటీర్లు	వీవోఏలు	పది ఎండీయూ యూనిట్లలో పనిచేసే సిబ్బంది
182 మంది	నలుగురు	20 మంది

ఐదు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది 15 మంది

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఐదుగురు

మద్దిపాడు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులపై వేధింపులు అధికమయ్యాయి. బాబు వస్తే జాబు గ్యారంటీ అని, లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నిండా ముంచేశారు. అధికారం చేపట్టి సంవత్సరం దాటినా కొత్త ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేకపోగా, చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించి వారి పొట్టకొట్టారు. వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది మద్దిపాడు మండలంలోని ఉద్యోగులు, నిరుద్యోగుల పరిస్థితి. బాబు వస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాడని, పరిశ్రమలు తెచ్చేస్తాడని టీడీపీ నాయకులు మండలంలో ఊరూరా గడపగడపకూ తిరిగి మరీ గత ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ, అధికారంలోకి అడుగుపెట్టిన వెంటనే సీఎం చంద్రబాబు కుట్ర బట్టబయలైంది. మోసం చేయడం తన నైజం.. నమ్మి మోసపోవడం మీ తప్పు అన్నట్లుగా ఉద్యోగుల పనిబట్టారు. ఒక్కొక్కటిగా ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో పడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసి దేశవ్యాప్తంగా ఎంతో పేరుపొందిన వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా గెలిచాక వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేదంటూ వలంటీర్లను తొలగించారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. జీతం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికి చివరకు ఆ ఐదు వేలు కూడా లేకుండా చేశారు. కూటమికి ఓటు వేసి మోసపోయామంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను బలవంతంగా తప్పించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని మీకు చేతనైంది చేసుకోండంటూ స్థానిక నాయకులు బయటకు గెంటేశారు. వేలాది మంది ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయి బతుకుదెరువు లేక అల్లాడిపోతున్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దుతో ఊడిన ఉద్యోగాలు...

వయస్సు పైబడి రేషన్ షాపునకు వెళ్లలేని వారు, వికలాంగులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీని సీఎం చంద్రబాబు రద్దు చేశారు. ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో వాటి డ్రైవర్లు, ఆపరేటర్లకు జీవనోపాధి లేకుండా పోయింది. స్వయం సహాయక సంఘాల పద్దులు రాసే అనిమేటర్లను సైతం చంద్రబాబు వదల్లేదు. గత ప్రభుత్వంలో పనిచేసిన యానిమేటర్లను కూటమి ప్రభుత్వం రాగానే తొలగించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలకు వీలు కల్పించడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు బజారునపడ్డారు. కూటమి ప్రభుత్వంలో తొలి సంతకం మెగా డీఎస్సీ అన్నారు. సంవత్సరం పూర్తయినా తొలి సంతకానికే దిక్కు లేకుండా పోయింది. కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టకపోతే చాలంటూ ఉద్యోగులు, ప్రజలు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కోదండ రామస్వామి సన్నిధిలో ఆడి మాస పూజలు


లక్ష గులాబీ అర్చన అందుకుంటున్న గోదా దేవి


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని గుర్రంవారివీధిలో శ్రీ కోదండ రామస్వామివారి సన్నిధిలో వేంచేసియున్న శ్రీ రంగమన్నార్ సమేత గోదా దేవికి ఆడి మాసాన్ని పురస్కరించుకుని సోమవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొణిజేటి శ్రీరాములు, వైదేహి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు ముందుగా గర్భాలయంలో ఆండాళ్ దేవి మూలమూర్తితో పాటు గోదా, రంగమన్నార్ ఉత్సవమూర్తులకు పంచామృతాలతో నేత్రపర్వంగా తిరుమంజనాన్ని జరిపించారు. అనంతరం వందలాదిగా తరలివచ్చిన భక్తజనసందోహం నడుమ లక్ష గులాబీ అర్చనను నేత్రపర్వంగా నిర్వహించారు. వేద పండితులు లక్ష్మీ హోమ హవనాన్ని శ్రీ మూల మంత్ర గోదా రంగనాథ పాఠనములను వేదోక్తంగా జరిపించి పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని గోదా, రంగమన్నార్‌కు నిర్వహించిన పూజలను కనులారా తిలకించి దేవేరుల తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు సూచించారు. సోమవారం సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద గల ట్రిపుల్ ఐటీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కుటుంబాలు నాశనం అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు వీడి జీవితాలను ముందంజలో నిలుపుకోవాలన్నారు. అంతేగానీ, మత్తుకు బానిసలై విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, కళాశాల ఏవో చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

ఎస్పీకి డ్రోన్ కెమెరా అందజేత

ఒంగోలు సిటీ: జిల్లా పోలీసు శాఖకు పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన మాకినేని వెంకట రమణయ్య, దంటు నరసింహారావు సోమవారం అత్యాధునిక సాంకేతికతతో కూడిన డీజేఐ ఎయిర్‌3ఎస్ డ్రోన్ కెమెరా అందజేశారు. ఎస్పీ ఏ.ఆర్.దామోదర్‌కు జిల్లా పోలీస్ కార్యాలయంలో దానిని అందించారు. దానికి పొదిలి పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ పొదిలి ఎస్సై వేమనకు ఎస్పీ దామోదర్ అందజేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా, ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు, వీఐపీ బందోబస్తు నిర్వహణలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు, అలాగే సుదూర ప్రాంతాల్లో ఉన్న అనుమానితుల కదలికలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని ఎస్పీ తెలిపారు. నేరాల కట్టడిలో డ్రోన్లు పోలీసులకు డేగ కన్నులా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, పొదిలి ఎస్సై వేమన, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేస్తున్న దాతలు

ఎస్పీని కలిసిన ఇన్‌స్పెక్టర్

ఒంగోలు సిటీ: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను జిల్లా కమ్యూనికేషన్ విభాగం ఇన్‌స్పెక్టర్ కె.మనోహర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కర్నూలు జిల్లా కమ్యూనికేషన్ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ప్రకాశం జిల్లా కమ్యూనికేషన్ విభాగానికి మనోహర్ వచ్చారు.



ఎస్పీ దామోదర్‌తో ఇన్‌స్పెక్టర్ మనోహర్

రెండు ఆటోలు ఢీ - ముగ్గురికి గాయాలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు సమీపంలోని ఎస్టీ కాలనీ వద్ద సోమవారం రెండు ఆటోలు ఢీకొనగా ముగ్గురు గాయాలయ్యాయి. వేములపాడు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఆటో.. ఒంగోలు నుంచి మద్దులూరు వైపు వెళ్తున్న ఆటో ఢీకొన్నాయి. ముగ్గురికి గాయాలవగా, చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. సంతనూతలపాడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.